మామిడి పంటపై పొగమంచు పగ

- పలుచోట్ల పూతకు రాని చెట్లు
- ఆందోళనలో మామిడి రైతులు



మామిడి తోటను కమ్మేసిన పొగమంచు



మామిడి రైతుల అవగాహన సదస్సులో సూచనలు చేస్తున్న అధికారులు (ఫైల్)

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్, జనవరి నెల మొదటి రెండు వారాల్లోపే మామిడి పూతకు వచ్చేది. ప్రస్తుతం జనవరి మూడో వారం వచ్చినప్పటికీ పూత అంతంత మాత్రంగానే ఉంది. దీంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న పొగమంచు కారణంగా వచ్చిన కొంచెం పూత కూడా రాలిపోయింది.

నిలిచిన తోటల కొనుగోళ్లు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పూత, పిందె దశల్లోనే తోటలు కొనుగోలు చేసి అక్కడే కుటుంబమంతా ఉండి కాయలు, పండ్లు మార్కెట్లో అమ్మకాలు చేస్తుంటారు. ప్రతి ఏడాది ఇలా కొనుగోలు చేసే వ్యాపారులు ఇప్పటి వరకు తోటల వైపు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఐదేళ్లు, మూడేళ్ల గడువు ఒప్పందంపై తోటలు కొనుక్కున్న వారు పూత లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- చలిగాలుల కారణంగా పూత ఆలస్యం అవుతుంది. మొగ్గలను ఉత్తేజపరిచి పూతను తెప్పించేందుకు రైతులు కొన్ని పద్ధతులు పాటించాలి.
- పూత నిలిచేందుకు లీటరు నీటిలో 8 గ్రాముల మిల్జికేన్ మందును కలుపుకొని ట్యాంక్‌కు 15 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి.
- బోరాన్ లోపంతో పూత వచ్చినా ఫలదీకరణ జరగకపోవడం వలన పిందె కట్టకపోవచ్చు. నివారణకు బోరాన్‌ను లీటర్ నీటిలో రెండు గ్రాముల మందు పిచికారీ చేయాలి.
- పూత సమయంలో తేనెమంచు కారణంగా వచ్చే పురుగులు నివారణకు లీటర్ నీటికి అసిఫేట్ 1.25 గ్రాములు మందు థియోమిథాక్సోమ్ 0.3 గ్రాముల మందు, మోనోక్రోటోఫాస్ 0.3 గ్రాముల మందును నీటిలో కలిపి తోటకు పిచికారీ చేయాలి.
- పూతకాడపై తెల్లటి పొడరులా కనిపించే బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం రెండు గ్రాములు, కారథాన్ ఒక ఎంఎల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పూత బయటికొచ్చే దశలో చెట్లపై ఆకుమచ్చ ఆంత్రాక్నోజ్, నల్లమచ్చ వంటి తెగుళ్ల నివారణకు కార్బెండిజమ్, థియోఫినైట్ మిథైల్ మందును లీటర్ నీటికి ఒక గ్రామును మందును కలిపి పిచికారీ చేయాలి.
- మామిడి పూతకు వచ్చేందుకు పూత పిందెలు నిలిచేందుకు పై జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారులు సూచనలు చేస్తున్నారు.

పూత రాలేదు



గతేడాది మామిడిలో ఆశించినంత దిగుబడి రాలేదు. ఈ ఏడాది పొగమంచు ప్రభావం మునుపెన్నడూ లేని విధంగా ఏర్పడుతోంది. దీంతో మామిడి చెట్లకు పూత ఇప్పటి వరకు రాలేదు. గతంతో పోల్చుకుంటే పూత రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత వారం పది రోజులుగా పొగమంచు కురవడం మరింత ఆందోళనగా ఉంది. పూత వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది కూడా మంచి దిగుబడి లేకుంటే తీవ్ర నష్టం వాటిల్లనుంది.

- టి.రమణ, మామిడి రైతు, కొత్తపల్లి గ్రామం, చిన్నమండెం మండలం

ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంది



ఈ ఏడాది పండ్ల తోటలపై మంచు ప్రభావం అధికంగా ఉంది. ఈ కారణంగా మామిడిలో పూత ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంది. రైతులు తప్పక అధికారుల సూచనలు పాటించాలి. అలానే పూమొగ్గలను ఉత్తేజపరిచి పూతను తెప్పించేందుకు కొన్ని పద్ధతులు ఉన్నాయి. వాటిని రైతులు పాటించాలి.

- వనితాబాయి, ఉద్యానవన శాఖాధికారిణి, రాయచోటి

డీఈఓను సస్పెండ్ చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కస్తూర్బా పాఠశాలలను పట్టించుకోని డీఈఓను ప్రభుత్వం సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దీవెన కుమార్ బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద తిప్పసముద్రం, ములకల చెరువు గురుకుల పాఠశాలలో అనేక అక్రమాలు జరుగుతున్నా జిలఆ విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులను కులం పేరుతో తిడుతున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల చేత పనులు చేయించుకుంటూ వారిని ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కస్తూర్బా గురుకుల పాఠశాలలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతోనే సిబ్బంది ముడుపులు తీసుకుంటున్నారని వాపోయారు. కలెక్టర్ స్పందించి ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారులపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపేంద్ర, గోవర్ధన్, నరసింహ, మల్లి, ఎం.రాజ్, ఆదిత్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

వీరబల్లి : కడప భారతి హాస్పిటల్ సహకారంతో స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలందించడంతోపాటు మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 26 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్, భోజన వసతి, మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది చాంద్ బాషా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఓబులవారిపల్లె : పౌష్టికాహారం ద్వార రక్తహీనత తొలగి ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల శివారు గ్రామమైన గద్దలరేవు పల్లి ఎస్టీ కాలనీలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, గర్భిణులు, వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రక్తహీనతను ముందుగానే గుర్తించి మందులు వాడాలని, గ్రామాలలో లభించే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా వినియోగించాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలను పరిశీలించి కొనాలి



కోడి చెన్నైగారిపల్లిలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెనగలూరు : మండలంలోని కోడిచెన్నైగారిపల్లిలోని వరిపంటలను శాస్త్రవేత్త శిల్పకళ, జిల్లా ఏడీఏ అశోక్ రెడ్డిలు పరిశీలించారు. కోడి చెన్నైగారిపల్లెకు చెందిన వరి రైతులు విజయవాడ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఆదేశాల మేరకు వరి చేనులను పరిశీలించినట్టు వారు తెలియజేశారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ప్రస్తుతం రైతులు అవలంభిస్తున్న విధానాలు తెలుసుకొని వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి విత్తనాలు తీసుకునేటప్పుడు రశీదు కచ్చితంగా పొందాలన్నారు. అలాగే విత్తనాలను పరిశీలించి తీసుకోవాలన్నారు. ఆర్ఎస్ఆర్ 15048 వరి విత్తనాన్ని నవంబర్‌లో నారుపోసి డిసెంబర్‌లో నాటుకోవాలన్నారు. వరినారులో అధిత మోతాదులో యూరియా వేస్తే అగ్గి తెగులు వస్తుందని, తగిన మోతాదులో వాడుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుచిత్ర, పెనగలూరు వ్యవసాయ శాఖ అధికారి సుబ్రమణ్యం, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోల్లోపల్లిలో ఉద్యానవన విద్యార్థుల సదస్సు

చిట్వేలి : రైల్వేకోడూరు నియోజకవర్గం అనంతరాజుపేట హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం పోల్లోపల్లి సచివాలయం వద్ద ఉద్యాన ప్రదర్శన, రైతు సదస్సు నిర్వహించారు. ఉద్యానవన 4వ సంవత్సరం విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పని అనుభవం కార్యక్రమం కోసం సి.కందులవారిపల్లి, పోల్లోపల్లికి కేటాయించబడ్డారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పీటీ శ్రీనివాస్, అసోసియేట్ డీన్, ఉద్యాన కళాశాల అనంతరాజుపేట, ముఖ్య శాస్త్రవేత్త ఎం.యువరాజ్ హాజరయ్యారు. వీరితోపాటు సందీప్ నాయక్, డాక్టర్ యోహాన్, డాక్టర్ ఈరేష్ కుమార్ అనే శాస్త్రవేత్తలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పూలతోటలు, నిమ్మతోటలు, బొప్పాయి తోటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : ఏప్రిల్ 1వ తేదీ నుంచి కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్‌లు అమలు చేయాలని చూస్తోందని వాటిని రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ, సాంబశివలు బుధవారం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రద్దు చేసిన విధానాలతో కొత్త చట్టాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజశేఖర్, పెంచలయ్య, గంగాధర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలతో రైతులకు లబ్ధి



రామాపురం : నట్టల నివారణ మందులను వేస్తున్న వైద్యులు



సుండుపల్లె : పశువులకు వైద్యం అందజేస్తున్న వైద్యాధికారులు

సుండుపల్లె : పశు ఆరోగ్య శిబిరాలతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతోందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు (ఏడీ) విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని జి.రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాలను మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీలలో పశువులకు మెరుగైన వైద్యాన్ని అందించినట్లు చెప్పారు. జి రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీలో 1384 గొర్రెలకు వైద్య సేవలు అందజేయడం జరిగిందన్నారు. అలానే పశువులకు ప్రథమ చికిత్సతోపాటు గర్భకోశ సమస్యగల పశువులకు వైద్యం అందించామన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కల్పనాయునిచెరువు పంచాయతీ కల్పనాయునిచెరువు, గాలంగుండ్లపల్లె గ్రామాలలో బుధవారం ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి 284 పశువులకు ప్రథమ చికిత్స, 11 గర్భకోశ సమస్యల పశువులకు, 538 పశువులకు, 208 దూడలకు, 6,226 గొర్రెలు, మేకలకు, నట్టల నివారణ మందులను మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అందించారు. రైతులకు పశువులకు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలపై అవగాహన కల్పించారు.

మానసిక రుగ్మతులను ధైర్యంగా ఎదుర్కోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరబల్లి : మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారు ఆత్మహత్యలకు పాల్పడకుండా చికిత్స ద్వార నయం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.రఘురామయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక రుగ్మతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్నాడని చెప్పారు. కొందరు మానసిక ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని బలవన్మరణాలకు చేసుకోవడం అవివేకమన్నారు. అలాంటి వారు మన చుట్టూ ఉంటే వారికి భరోసానిచ్చి మానసిక ఒత్తిడి నుంచి బయటపడేలాగా ప్రయత్నించాలన్నారు. ఈ వ్యాధితో బాధపడేవారు వైద్యులు సంప్రదించి చికిత్స పొంది జీవితాలలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీపీ బాబుల్‌రెడ్డి

పుల్లంపేట : ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దు బాబుల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 400 ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని, రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో ఉన్నారన్నారు. పుల్లంపేట శ్మశాన వాటిక ప్రహరీ గోడ కూల్చి మూడు నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. అవ్వారు విజయ్ బాబు సర్వే నెంబరు. 280/1లో 50 సెంట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, ఇది తోపు పోరంబోకు భూమి అని, కావున తక్షణమే ఆన్‌లైన్ రద్దు చేసి హిందూ శ్మశాన వాటికను కాపాడాలన్నారు. అనంతరం మండల అభివృద్ధికి ఎమ్మెల్యే సహకరించాలని వారు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్, వైస్ ఎంపీపీ జయశంకర్, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, దొండ్లోపల్లి సర్పంచ్ మణి, ఏఓ శ్రీధర్ రెడ్డి, మణికంఠ, ఆలం చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు పోలీస్ నెంబర్ తప్పనిసరి

రామాపురం : మండలంలో తిరుగుతున్న ఆటోలకు పోలీస్ నెంబర్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరుగుతున్న ఆటోలకు పోలీస్ సీరియల్ నెంబర్లు ఏర్పాటు చేశామేన్నారు. ఈ నెంబర్ల ద్వార ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఆటో డ్రైవర్లకు ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఆటో సమాచారం పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉంటుందని, మండల పరిధిలో ఉన్న ప్రతి ఆటోకు పోలీస్ నెంబరు కలిగి ఉండాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు.

క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్ : క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు జరిగిన ప్రవేశాల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాలలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణానికి చెందిన మురళీ కోచింగ్ సెంటర్‌కు చెందిన నితిన్, రెడ్డి రాకేష్‌లకు ఎంపియ్యారు. ఈ సందర్భంగా బుధవారం మంత్రిని వారు కలిశారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాస రాజు, మురళీ కోచింగ్ సెంటర్ గౌరవ సలహాదారుడు మురళీ మోహన్ రాజు, టీడీపీ నాయకులు సురేష్ రెడ్డి, విజయసారథి రాజు, ఉపాధ్యాయుడు కులశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

పెనగలూరు : మండలంలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ ఉమామహేశ్వర్ అన్నారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేసేందుకు కూలీల సంఖ్యను పెంచాలని ఆయన సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మీమీ గ్రామాల పరిధిలోని కూలీలు పనులకు వచ్చేటట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పండ్ల తోటల బిల్లులను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని ఆయన తెలియజేశారు. వివిధ అంశాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించేలా చూడండి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలలో పనిచేస్తున్న ఇన్‌చార్జ్ జిల్లా అధికారుల స్థానంలో రెగ్యులర్ అధికారులను నియమించేలా చూడాలని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న కోరారు. బుధవారం రాయచోటిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలుసుకుని మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలలో రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోందన్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 55 ఎస్సీ హాస్టళ్లలో సుమారు 5 వేల మంది, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖలోని 40 వసతి గృహాలలో 3వేల మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారన్నారు. పీలేరు, రాయచోటి ఏఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న అధికారిని ఎస్సీ సంక్షేమశాఖకు జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా కొనసాగుతున్నారన్నారు. బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారిగా రాయచోటికి రాజంపేటలకు చెందిన ఏఎస్‌డబ్ల్యూఓ కొనసాగుతున్నారన్నారు. ఏఎస్ఓ స్థాయి అధికారులకు జిల్లా అధికారుల బాధ్యతలు అప్పజెప్పడంతో వారు పని భారంతో తల్లడిల్లుతున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇన్‌చార్జ్ జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారులుగా కొనసాగుతున్న వారి స్థానంలో రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పత్రికలు మూలస్తంభాలు



సీనియర్ పాత్రికేయులను సత్కరిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ కాశిగారి ప్రసాద్

రాజంపేట టౌన్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు పత్రికలు మూల స్తంభాలని అన్నమాచార్య యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కాశిగారి ప్రసాద్ తెలిపారు. ఇండియన్ న్యూస్ పేపర్స్ డేని పురస్కరించుకొని బుధవారం రాత్రి పట్టణంలోని నూనెవారిపల్లెలో ఉన్న కాశిగారి స్కిల్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ భవనంలో సీనియర్ జర్నలిస్టులైన మలిశెట్టి సుబ్బరాయుడు, ఎం.సుబ్బనరసింహులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాశిగారి ప్రసాద్ మాట్లాడుతూ 1780వ సంవత్సరం జనవరి 29వ తేదీ భారతదేశంలో మొదటి వార్త పత్రికగా హికీస్ బెంగాల్ గెజిట్ ప్రచురితమైందని గుర్తు చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంలో పత్రికలు ముఖ్య భూమిక పోషించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒకవైపు సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ సోషల్ మీడియా విస్తృతంగా ఉన్నా ఇప్పటికీ ప్రజలు పత్రికల్లో వచ్చే వార్తలనే ప్రామాణికంగా తీసుకుంటారని చెప్పారు. తరం మారుతున్నా పత్రికలకు ఉన్న ఆదరణ చెక్కుచెదరడం లేదని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ అరచేతిలో ఉంటే ప్రపంచంలోని మారుమూల సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉన్నప్పటికీ అనేక మంది నిద్రలేవగానే పత్రికలను చూడనిదే తమ దినచర్యను ప్రారంభించని వారు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలన్నారు. పత్రికల్లో అన్ని వర్గాలకు సంబంధించిన సమాచారం ఉంటుందని తెలిపారు. అందువల్ల విద్యార్థులు, యువత పత్రికలను చదివే అలవాటు చేసుకోవాలని కోరారు. విద్య, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, కరెంట్ అఫైర్స్, వ్యక్తిత్వ వికాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి వంటి విషయాలు పత్రికల్లో సోదాహరణంగా వివరిస్తూ కథనాలు ప్రచురితమవుతాయన్నారు. ఇవి మనిషి జీవనశైలిని మంచి మార్గంవైపు పయనించపచేయడానికి ఎంతగానో దోహదపడగలవన్నారు. సన్మాన గ్రహీతలు మలిశెట్టి సుబ్బరాయుడు, ఎం.సుబ్బనరసింహులు మాట్లాడుతూ ఇండియన్ న్యూస్‌పేపర్స్ డేని పురస్కరించుకొని కాశిగారి ప్రసాద్ తమను సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాత్రికేయ రంగంలో తమ సేవలను గుర్తించి చేసిన ఈ సత్కారం తమకు జీవితాంతం గుర్తుండిపోతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రొఫెసర్ కల్యాణి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగనపల్లె వెంకటరమణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయండి



ఆటోలకు స్టిక్కర్లను అందిస్తున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

రాయచోటి టౌన్ : ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని సీపీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆటో, క్యాబ్, జీపు, కారు డ్రైవర్లకు రహదారి భద్రత, హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వాతి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుందో ఎలా వ్యాపించదో వివరించి చెప్పారు. ఎయిడ్స్ సోకిన వారిపై వివక్ష చూపకుండా వారితో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, ఏపీఎస్ఏసీఎస్ అనే యాప్‌తోపాటు టోల్ ఫ్రీ నంబర్ 1097 ఉందని దానిని సంప్రదించవచ్చని తెలిపారు.


ఆటోలకు క్యూఆర్‌డబ్ల్యూ స్టిక్కర్లు

ఆటోలకు, జీపులకు, కార్లకు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా పీసీఎస్ఎస్ క్యూఆర్ డబ్ల్యూ స్టిక్కర్లను అందించారు. ఈ స్టిక్కర్ల వలన మీకు ఎన్నో లాభాలు ఉంటాయని చెప్పారు. ఈ స్టిక్కర్లను ప్రతి ట్రావెల్ వాహనదారులు తప్పకుండా అతికించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ఎస్ క్యూఆర్ డబ్ల్యూ విజయలక్ష్మి ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాసిరకం




కంకర తేలి దర్శనమిస్తున్న నెల రోజుల కిందట వేసిన తారురోడ్డు




నెర్రెలు బారిన ఆర్అండ్ బీ రోడ్డు

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామ నుంచి వెంకటాయపల్లె వరకు వేసిన తారు రోడ్డు పనులు నాసిరకంగా జరిగాయని బుధవారం స్థానికులు తెలిపారు. నాసిరకంగా వేసిన తారు రోడ్డు నెర్రెలు బారి జ్యోతి, జ్యోతి గొల్లపల్లె గ్రామాల సమీపాన రహదారి దెబ్బతింది. 1100 మీటర్ల మేర జరిగే పనులకు గతంలో అధికారులు టెండర్‌లు పిలిచారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ డిసెంబర్ నెల చివరిలో పనులను ప్రారంభించారు. రోడ్డు వేసి నెల గడువకుండానే రోడ్డు దెబ్బతినడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం కారణంగానే రోడ్డు నాసిరకంగా జరిగాయంటూ వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈ గంగిరెడ్డిని వివరణ కోరగా దెబ్బతిన్న రహదారిని పరిశీలించి మరమ్మతులకు చర్యలు చేపడతామని తెలియజేశారు.

నివాళి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి



మంగమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న రమేష్ రెడ్డి

పుల్లంపేట : అనంతయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి మామ మాజీ జెడ్పీటీసీ సిద్దా వెంకటసుబ్బమ్మ భర్త సిద్దా రాజారెడ్డి బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు.

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ గడికోట వెంకట సుబ్బారెడ్డి తల్లి కొండమ్మ దశ దిన కార్యక్రమంలో ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొని కొండమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అలాగే నందలూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ మండల కో–ఆప్షన్ సభ్యులు పఠాన్ షబ్బీర్ ఖాన్ (హాల్ మస్తాన్) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి షబ్బీర్ ఖాన్ మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు.

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని ఈడిగపల్లెకు చెందిన రిటైర్డ్ టీచర్ తుమ్మల మంగమ్మ పెద్ద కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, హరినాథ్, క్రిష్ణ, దిలీప్ రాజు, గంగయ్య, సుబ్బరాయుడులు మంగమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.